క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



నగరి : మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడకు చెందిన దమయంతి కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.లక్ష అందింది. దమయంతి భర్త సెల్వం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరైంది. గురువారం సత్రవాడ దళితవాడ సచివాయం వద్ద లబ్ధిదారు దమయంతిని పిలిపించి ఆమె ఖాతా కు జమ అయిన వైఎస్సార్ బీమా వివరాలను అందజేశారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన

గంగాధరనెల్లూరు: సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ సూచించారు. మండలంలోని కొత్త వెంకటాపురం, పాతవెంకటాపురం గ్రామాల్లో గురువా రం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించకుంటే వ్యాధులు సోకుతాయన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనారోగ్యానికి గురైతే సొంత వైద్యం మాని పీహెచ్‌సీల్లో చికిత్స పొందాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పనుల పరిశీలనలో అధికారులు

నింద్ర: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమరేంద్రబాబు తెలిపారు. మండలంలోని ఇరుగువాయి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మా ట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని తెలిపారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, సర్పంచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

బంగారుపాళెం: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని ఎస్టీఓ హరిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగారుపాళెం సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని పెన్షనర్లు ఫిబ్రవరి నెలాఖరు లోపు లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్టుతో పాటు ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకం, పెన్షన్ పుస్తకంతో పాటు మొబైల్ ఫోన్(ఓటీపీ కోసం) తీసుకురావాలని సూచించారు. సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్లు సీఎఫ్ఎంఎస్ ఐడీతో ఆధార్, మొబైల్ ఫోన్ నంబర్లను అనుసంధానం చేసుకోవాలన్నారు. ఈనెల 20 తేదీ లోపు సీఎఫ్ఎంఎస్‌తో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

రెవెన్యూ వసూళ్లపై ట్రాన్స్‌కో సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి సెక్షన్‌లో రెవెన్యూ వసూళ్లు వందశాతం చేయాలని ట్రాన్స్‌కో అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మచారి అన్నారు. గురువారం ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కంటే బిల్ కలెక్షన్ పెరిగిందన్నారు. పంచాయతీల నుంచి బకాయిలు రూ.96 కోట్లు ఉన్నాయని, నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని తెలిపారు. త్వరలో ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తారని, సంబంధిత అధికారులతో మాట్లాడి అందులో 20 శాతం అయినా బిల్లులు కట్టేలా కృషి చేయాలన్నారు. ప్రైవేటు సర్వీసులు బిల్లులు కట్టకపోతే విద్యుతు సరఫరా కట్ చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఇన్‌చార్జి ఏఏఓ గోవిందరాజులు, ఏఈలు పాల్గొన్నారు.

బస్సుల కండీషన్ మెరుగు పరచుకోవాలి

డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి

చిత్తూరు రూరల్: బస్సుల కండీషన్‌ను మెరుగు పరచుకోవాలని డీపీటీఓ జితేంద్ర నాథ్‌రెడ్డి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో గురువారం ఆయన డిపో అధికారులు, గ్యారేజీ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బస్సులోని లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దాలన్నారు. అలాగే ఇంధన పొదుపు పాటించాలన్నారు.

గ్రామాల దాహార్తికి శాశ్వత పరిష్కారం

వడమాలపేట మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు మంత్రి ఆర్కేరోజా తీసుకున్న చర్యలు సఫలీకృతమయ్యాయి. జలజీవన్ మిషన్ కింద మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.2.17 కోట్లు మంజూరు అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలయ్యే ఈ పథకం కింద మండలంలో ట్యాంకుల నిర్మాణానికి అధికారులు టెండర్ల ప్రక్రియను ప్రారంభించారు.

- మంత్రి రోజా కృషితో నిధులు విడుదల
- ట్యాంకుల నిర్మాణానికి రూ.2 .17 కోట్లు మంజూరు
- టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభం



వడమాలపేట కావలి వీధిలో శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు

వడమాలపేట : మండలంలో తాగునీటి సమస్యలు శాశ్వతంగా తీరనున్నాయి. ఎప్పుడో 40 సంవత్సరాల కిందట నిర్మించిన తాగు నీటి ట్యాంకులు పూర్తిగా దెబ్బతిని కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ ట్యాంకులను తొలగించి పునర్నిర్మించాలని గ్రామస్తులు పర్యాటక శాఖ మంత్రి రోజా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందించి మండలంలో ఏ ఏ గ్రామాల్లో ట్యాంకులు నిర్మించాలో నివేదిక తెప్పించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులతో అమలయ్యే జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి సిఫార్సులతో ఆర్థికశాఖ వడమాలపేట మండలానికి రూ.2.కోట్ల 17లక్షల జేజేఎం నిధులను మంజూరు చేసింది. జల జీవన్ మిషన్ పథకం కింద పంచాయతీల వారీగా కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు. వడమాలపేట పంచాయతీ కావలి వీధిలో నీటి ట్యాంకు నిర్మాణానికి రూ.40 లక్షలు, నారాయణపురం పంచాయతీ ఎస్టీ కాలనీకి రూ.18 లక్షలు, పూడి పంచాయతీ బీసీ కాలనీకి రూ.22 లక్షలు, బంగారెడ్డి కండ్రిగ పంచాయతీ ఎస్‌వీఆర్‌కండ్రిగ హరిజన వాడ గ్రామానికి రూ.18 లక్షలు, తిప్పారెడ్డి కండ్రిగ గ్రామానికి రూ.18 లక్షలు, బాలినాయుడు కండ్రిగ పంచాయతీ బాలి నాయుడు కండ్రిగ హరిజనవాడకు రూ.18 లక్షలు, ఎస్‌బీఆర్‌పురం పంచాయతీ చెంచువారి కండ్రిగ ఎస్టీ కాలనీకి రూ.15 లక్షలు, ఓబీఆర్ కండ్రిగ పంచాయతీ ఓబీఆర్ కండ్రిగ గ్రామానికి రూ.22 లక్షలు, రామరాజు కండ్రిగ ఎస్టీకాలనీకి రూ.18లక్షలు, ఓబీఆర్‌కండ్రిగ ఎస్టీ కాలానికి రూ.15 లక్షలు, వడమాల పంచాయతీ వడమాల ఆది ఆంధ్ర వాడకు రూ.20 లక్షలు, హరిజనవాడకు రూ.22 లక్షలు, టీసీ అగ్రహారం పంచాయతీ ఎస్టీకాలనీకి రూ.20 లక్షలు, చింతకాల్వ పంచాయతీ ఇర్లపాలెం గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి రూ.15 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. ట్యాంకుల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రక్రియ పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మంత్రి రోజా కృషితో మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి జేజేఎం నిధులు విడుదల అయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణాలు ప్రారంభిస్తాం. ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగు నీరు అందిస్తాం.

–రామ్మోహన్,ఏఈ,ఆర్‌డబ్ల్యూఎస్

వైభవంగా పంచమి వేడుకలు



పుత్తూరు: ద్రౌపదీదేవి ఆలయంలో,



సదాశివేశ్వరస్వామి ఆలయంలో..

పుత్తూరు రూరల్: పుష్యమాసం బహుళ పంచమిని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజస్వామి ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పళ్లిపట్టుకు చెందిన పండితుడు పయణిచే భగవద్గీత పారాయణం, సంకీర్తనల ఆలపన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గురుప్రసాద్‌చే భాగవత పారాయణం, తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ లారీ మోహన్ పర్యవేక్షించారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయంలో శ్రీగురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. బహుళ పంచమి తిథిని పురస్కరించుకుని తొలుత వినాయక పూజ, కలశ పూజ, పలు వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృతం, చందనంతో అభిషేకం చేశారు. సుగంధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మహామంగళ హారుతులిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గీతామందిరంలో.. గీతా మందిరంలోని శ్రీకృష్ణుడికి గురువారం పంచమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు జరిగాయి.

పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: సేవా దృక్పథం కలిగిన ఔత్సాహికుల నుంచి పారాలీగల్ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురువారం పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. ఈ పోస్టులకు ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, న్యాయవాదులు, అంగన్‌వాడీ సహాయకులు, సామాజిక కార్యకర్తలు, కార్మిక సంఘాల సభ్యులు, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు. ఎలాంటి రాజకీయ పార్టీలతో సంబంధాలు, క్రిమినల్ కేసులు ఉండకూడదని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ లోపు కోర్టువారు నిర్ణయించిన నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మండల సేవాధికార సంస్థ పేరిట నేరులో గానీ, పోస్టు ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు మండల సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: సమాచార హక్కు చట్టం 2023 సంవత్సరం క్యాలెండర్లను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో తహశీల్దారు ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి ఆవిష్కరించారు.. యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యూనియన్ నాయకులు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని సమాచారం క్యాలెండర్‌లో పొందుపరచడం అభినందనీయమన్నారు. యూనియన్ జాతీ య అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు రాజేష్‌కుమార్, గజేంద్ర, నాగరాజ్, ధనంజయరెడ్డి, మోహన్‌రావు, నవీన్, సురేఖ, లక్ష్మయ్య, పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసమే విజయ సాధనం



పుత్తూరు: నివాళులర్పిస్తున్న ధ్యాన మందిరం సభ్యులు



వడమాలపేట: పాల్గొన్న సంఘం సభ్యులు



వెదురుకుప్పం: బహుమతి అందజేస్తున్న ఎస్ఐ

పుత్తూరు రూరల్: అపారమైన ఆత్మవిశ్వాసమే విజయానికి సాధనమని పుత్తూరు రామకృష్ణ మిషన్ సేవా సమితి కార్యదర్శి మునికృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక త్రినేత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువతరం వివేకానందస్వామిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని సూచించారు. ప్రతి మనిషికి బలమే జీవనమని, బలహీనతే మరణమని అన్నారు. మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి పెరిగేందుకు ధ్యాన మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. అంతకు ముందు వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు ధ్యాన మాస్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద ఆదర్శం కావాలి

వడమాలపేట: స్వామీ వివేకనందను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎస్‌వీపురం నెహ్రూ యువజన సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో చైతన్యం, దేశభక్తిని వివేకానంద ఇనుమడింప చేశారని తెలిపారు. వివేకానంద సేవలను కొనియాడారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: యువకులు స్వామి వివేకానంద బాటలో నడవాలని ఎస్ఐ గోపి అన్నారు. మండల కేంద్రంలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని బుల్లెట్ యూత్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్ మురళి, సామాజిక కార్యకర్త పోటుగారి భాస్కర్, మునికృష్ణయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలోని చింతలగుంటలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద చిత్ర పటానికి పూల వేసి నివాళులు అర్పించారు. ప్రతినిధి కృష్ణయ్య, మురగేష్ పాల్గొన్నారు.

పల్లెల్లో మొదలైన పండుగ సందడి



భోగి మంటలకు తాటిమట్టలు తీసుకొస్తున్న యువకులు

పాలసముద్రం : మండలంలో సంక్రాంతి సందడి మొదలైంది. ఏడాదిలో మొదటి పండుగ కావడంతో కొత్త దుస్తులు, పండుగకు అవసరమైన సామగ్రి కొనుగోలులో గ్రామీణులు నిమగ్నమయ్యారు. ఇళ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. శనివారం జరిగే భోగి పండుగకు చిన్నారులు, యువత సిద్ధమయ్యారు. గ్రామాల్లో చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా భోగి మంట వేసేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. 'మా వీధిలో పెద్ద భోగి వేశారంటే మా వీధిలో వేశారని' యువకులు పోటీ పడుతుంటారు. వీధిలోని యువకులు, చిన్నారులు ఒక్కటై భోగి మంటలో వేసేందుకు తాటిమట్టలు, ముళ్లకంపలను సిద్ధం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పిడకలను సేకరిస్తున్నారు.

డిప్యూటీ సీఎంను విమర్శించే అర్హత లేదు

పాలసముద్రం : డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని విమర్శించే అర్హత టీడీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బి.చిట్టిబాబునాయుడుకు లేదని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. గురువారం పాలసముద్రంలో పార్టీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో డిప్యూటీ సీఎం చొరవతో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. టీడీపీ నేతలకు ఇవేవి కనిపించడం లేదన్నారు. చిట్టిబాబునాయుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. టీడీపీ పాలనలో పచ్చచొక్కాల వారికే సంక్షేమ ఫలాలు అందాయని, నేడు అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయని పేర్కొన్నారు. ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రాజు, ప్రకాశం, పయణి, మనోహర్, బాబు, గోపి, వరదరాజు, సిద్ధమందడి, గోపాల్ రాజామణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో ఆండాళ్ నీరాట్టు ఉత్సవం



తిరుచ్చి వాహనంపై విహరిస్తున్న గోదాదేవి

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి సన్నిధిలో ఆండాల్ నీరాట్టు ఉత్సవం గురువారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ధనుర్మాస పూజలు, తిరుప్పావై అనంతరం గోదాదేవిని తిరుచ్చిపై ఆశీనులు చేసి పుర వీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆండాళ్‌కు నీరాట్టు ఉత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్య పర్యవేక్షించారు.

విడాకులు పొందినా వేధింపులు

- మాజీ భర్తపై టీచర్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఏర్పేడు: ఉపాధ్యాయురాలిని వేధిస్తున్న ఆమె మాజీ భర్తపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి గురువారం రాత్రి తెలిపారు. సీఐ కథనం..రేణిగుంట మండలం బిస్మిల్లా నగర్‌కు చెందిన దుర్గా భవాని మండలంలోని గుడిమల్లం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వెంకటబ్రహ్మంతో 2008న ఆమెకు వివాహమైంది. భర్త వేధింపులను భరించలేక 2015 నవంబర్‌లో మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అలాగే విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో 2022 సెప్టెంబర్ 20న కోర్టు విడాకులు మంజూరు చేసింది. అయితే ఈ నెల 10న మాజీ భర్త వెంకటబ్రహ్మం స్కూలుకు వెళ్లి దుర్గాభవానిని బెదిరించి దుర్భాషలాడారు. గురువారం ఆమె ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేశారు.

థైరాయిడ్ పరీక్ష యంత్రం ప్రారంభం

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల బయో కెమిస్ట్రీ విభాగంలో థైరాయిడ్ హార్మోనుల పరీక్ష చేసే అత్యాధునిక బేక్‌మెన్ కూల్టర్ ఆటో అనలైజర్ యంత్రమును ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ చేతులమీదుగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా రోగులకు వివిధ రకాలైన 50 రక్త పరీక్షలు చేయవచ్చని తెలిపారు. సుమారు రూ.16 లక్షల విలువగల అత్యాధునిక అనలైజర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర దేవి, బయో కెమిస్ట్రీ నాన్ మెడికల్ డెమోనిస్ట్రేటర్ సురేష్ బాబు, నాన్ మెడికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, నాన్ మెడికల్ డెమోనిస్ట్రేటర్ ఏ.గిరి బాబు, బయో కెమిస్ట్రీ విభాగ ఫ్యాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



రోడ్డు పరిశీలనలో పాల్గొన్న ఎంపీపీ లత, నాయకులు

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ లత అన్నారు. గురువారం శెట్టిగుంట ఎస్టీ కాలనీకి వేసిన గ్రావెల్ రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి చొరవతో అన్ని గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కత్తెరపల్లె, ఆలత్తూరు, ఈడిగపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్‌లు సుందర్‌రాజ్, సర్వేశ్వర్, ఉప సర్పంచ్ కుప్పయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీడీవో మోహన్‌మురళి పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెక్టార్ పదవిని దళితులకు కేటాయించాలి

తిరుచానూరు: ఎస్వీ యూనివర్సిటీలో ఖాళీగానున్న రెక్టార్ పదవిని అర్హత కలిగిన దళిత అధ్యాపకులకు కేటాయించాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు ఎం.ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎస్వీయూలోని వర్సిటీ వీసీని కలిసి వినతి పత్రం సమర్పించారు. వీరిలో యూనియన్ నాయకులు నరేష్, ముని, హేమచంద్, అక్బర్, చరణ్, గౌతమ్, చందు, పవన్, మోహన్, రాకేష్ ఉన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలపై గురువారం పీఆర్‌టీయూ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావుతో చర్చించారు. జిల్లాలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తు, సర్దుబాటు మొదలైన అంశాలపై మాట్లాడారు. అనంతరం పీఆర్‌టీయూ డైరీ, క్యాలెండర్లను డీఈఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్ చంద్రారెడ్డి, కణ్ణన్, ఇతర నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.